సాక్షి
అనకాపల్లి
శనివారం, 8, మార్చి, 2025



మహిళ	ఆమె
మహోన్నత వ్యక్తి	చేయని కార్యం లేదు
మహాద్భుత శక్తి	రాయని కావ్యం లేదు
అపరిమిత ప్రేమమూర్తి	నేర్వని విద్య లేదు
అనంత శాంతమూర్తి	అసాధ్యం ఏదీ లేదు

మగువా మగువా లోకానికి తెలుసా నీ విలువా.. మగువా మగువా నీ సహనానికి సరిహద్దులు కలవా.. అటు ఇటు అన్నింటా, నువ్వే జగమంతా పరుగులు తీస్తావు ఇంటా బయట... అలుపని రవ్వంత అననే అనవంట... వెలుగులు పూస్తావు వెళ్లే దారంత... అన్ని రంగాల్లో తనదైన ముద్ర వేస్తున్న 'ఆమె'కు వందనం అంటోంది జగతి. **అమ్మగా, ఆలిగా, అక్కగా, చెల్లిగా..** ఆత్మీయతతో అనురాగాన్ని పంచే..అమృతమూర్తికి

విజయోస్తు స్త్రీరస్తు...!



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి, ఇతర జిల్లా అధికారులు



చెరకు తోటలో వ్యవసాయ **పనుల్లో నిమగ్నమైన** ఆ మహిళా రైతు **పేరు సుంకరి** అప్పారావమ్మ. బుచ్చెయ్యపేట **మండలం కేపీ** అగ్రహారానికి చెందిన ఆమె భర్తకు **దీటుగా 30** ఏళ్లుగా చెరకు సాగు పనుల్లో **పాల్గొంటోంది.** మగవారికి సమానంగా ఆడవారు **కష్టపడితేనే** కుటుంబం హాయిగా సాగుతుందని, **ఎంతో** ఆత్మవిశ్వాసం కలుగుతుందని ఆమె చెబుతోంది. 3 ఎకరాల్లో చెరకు తోట సాగు చేస్తున్నామని, చెరకు నాట్లు, గొప్పులు, పొలంలో అన్ని రకాల పనులు చేయగలనని చెప్పింది. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఈ ఏడాది సక్రమంగా నడవకపోవడంతో బెల్లం ఆడి లాభాలు వచ్చేలా చూసుకుంటున్నామని చెప్పింది. ఇద్దరు అబ్బాయిల్ని, అమ్మాయిని చదివించి వారికి వివాహాలు చేశామని, ఇల్లు కట్టుకొని సంతోషంగా ఉన్నామని తెలిపింది. మగవారితోపాటు ఆడవారు కష్టపడితే ఆర్థిక ఇబ్బందులుండవని పేర్కొంది. – బుచ్చెయ్యపేట

సాక్షి, అనకాపల్లి: అవకాశాలను అందిపుచ్చుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. పురుషులకు ఎందులోనూ తీసిపోమని తమ తమ వృత్తుల్లో ప్రావీణ్యతను చాటుకుంటున్నారు. అమ్మలా లాలించడమే కాదు.. సమర్థవంతంగా పాలించడంలోనూ ముందుంటామని నిరూపించుకుంటున్నారు. వివిధ విభాగాల్లో అధికారులుగా తమదైన ముద్ర వేసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇద్దరూ మహిళలు కావడం విశేషం. జిల్లా యంత్రాంగంలో వివిధ విభాగాల్లో హెచ్‌వోడీలు మహిళలే ఉన్నారు. కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి శిరీషరాణి, పౌరసరఫరాల శాఖ అధికారి జయంతి, డీఎల్‌డీఓ మంజులావాణి, అనకాపల్లి డీఎస్పీ శిరీష, ఆర్డీవో షేక్ ఆయిషా.. ఇంకా డివిజన్, మండల స్థాయిలో వివిధ విభాగాల్లో మహిళా ఉద్యోగులు సేవలందిస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మహిళలదే అగ్రస్థానం. విధానపరమైన నిర్ణయాల అమలులోనూ అతివలు కీలకంగా నిలుస్తూ తమదైన పాత్ర పోషిస్తున్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, విశాఖ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి జిల్లా రాజకీయ రంగంలో ఉన్నత స్థానాల్లో ఉన్నారు.

ఏ పని చేపట్టినా విజయమే..



మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారు. మహిళలు ఏ పనైనా సమర్థవంతంగా చేయగలరు. ఒక ఇంటి బాధ్యతను ఎంత సక్రమంగా నడపిస్తారో.. అదే విధంగా విధుల్లోనూ రాణిస్తారు. గతంలో ఆడవారిని ఇంటికే పరిమితం చేసేవారు. కానీ ఇప్పుడు అన్ని రంగాలలో మహిళలే ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ప్రతి ఆడపిల్ల విద్యాపరంగా... ఆర్థికంగా ఎదిగితే వారికి స్వతంత్రంగా అత్యున్నత స్థాయికి వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. దేశాభివృద్ధిలో కూడా మహిళ పాత్ర ఉంది.

– విజయ కృష్ణన్, కలెక్టర్

మహిళకు చదువు.. ఇంటికి వెలుగు



ఒక ఇంటిలో మహిళ చదువుకుని ఉద్యోగం చేస్తే.. ఆ ఇల్లంతా వెలుగుతూ ఉంటుంది. వారి చదువును తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకూడదు. వారికి చిన్నతనంలోనే పెళ్లి చేయడం తగదు. వారు మానసికంగా ఎదగాలి. తల్లిదండ్రుల ఆలోచనా విధానంతోనే మహిళ భవిష్యత్తు ఉంటుంది. పదో తరగతి తరువాత చదువులోనే కాదు.. వారు క్రీడలతో సహా ఏ రంగంపై ఆసక్తి చూపినా ప్రోత్సహించాలి. కుటుంబంలో ఒక మహిళ అభ్యుదయం వెనక తల్లిదండ్రులు, అన్న, తమ్ముడు ప్రోత్సాహం ఉంటుంది.

– జాహ్నవి, జాయింట్ కలెక్టర్

ప్రతి రోజు పండగ కావాలి

- కలెక్టర్ విజయ కృష్ణన్ ఆకాంక్ష
- మహిళలకు శుభాకాంక్షలు



డిస్కస్ త్రో ఆడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: మహిళల జీవితంలో ప్రతి రోజు పండగ కావాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆమె మిగతా మహిళా అధికారులతో కలసి పాల్గొన్నారు. కేక్ కట్ చేసి, జిల్లా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ప్రతి మహిళ వారి కోరికలు, లక్ష్యాలను నెరవేర్చుకొనేలా కుటుంబ సభ్యులు సహాయపడాలని, చదువు, ఉద్యోగాలలో వారిని ప్రోత్సహించాలని కోరారు. నేడు అన్ని రంగాలలో మహిళలు ముందుంటున్నారని, రాజకీయ, విద్య, న్యాయ, వైద్య, రక్షణ, పరిపాలన, శాస్త్ర సాంకేతిక రంగాలలో ఉన్నత పదవులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, కళలు, ఆటలు, పారిశ్రామిక, వ్యవసాయం వంటి అనేక రంగాలలో ఉన్నతంగా రాణిస్తున్నారని అన్నారు. ప్రతి బాలికకు విద్యను అందించాలని, మహిళకు ఉన్నత స్థానాన్ని ఇవ్వాలని, వారి మాటకు గౌరవాన్నివ్వాలన్నారు. మహిళను గౌరవించిన సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. జేసీ ఎం.జాహ్నవి మాట్లాడుతూ ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఉన్నత స్థానానికి చేరిన మహిళా అధికారులు జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మహిళల జీవితాల్లో ఎన్నో మార్పులు వచ్చాయని కుటుంబ బాధ్యతలతో పాటు, వృత్తిలో కూడా రాణిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. చిన్నారులు నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు సుబ్బలక్ష్మి, రమామణి, మనోరమ, కలెక్టరు కార్యాలయ పరిపాలనాధికారి బి.వి.రాణి, ఇతర మహిళా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల వికాసం కోసం..



ఆర్మీ యూనిఫాంతో ఉన్న విద్యార్థులతో ఉపాధ్యాయిని పద్మజ

టీచర్‌గా పాఠాలు బోధించడాని కే పరిమితం కాలేదు ఆమె. సేవలతో ఆదర్శప్రాయంగా నిలిచారు. విద్యార్థులు మెచ్చే మార్గదర్శిగా గుర్తింపు పొందారు. కె.జె.పురం జెడ్పీ హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న పారుపల్లి వెంకట సత్య పద్మజ. పనిచేసిన ప్రతి పాఠశాలలో తనదైన ముద్ర వేశారు. ఆమె వెంకటాపురం ఎంపీపీ పాఠశాలలో పనిచేస్తున్నప్పుడు 2019లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డును గురుపూజోత్సవం సందర్భంగా అందుకున్నారు. ఆ పాఠశాలకు ఆమె రూ.1.35 లక్షల విలువ చేసే 10 ఇనుప బెంచీలను విరాళంగా అందజేశారు. చినగదిలి మండలం లక్ష్మీనగర్, వెంకటాపురం పాఠశాల విద్యార్థుల కోసం కంచాలు, గ్లాసులు, షూలు అందించారు. పేద విద్యార్థులకు ఫీజులు కడుతుంటారు. కొత్తపాలెం హైస్కూలు విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయిని పద్మజ ఎన్‌సీసీ స్టూడెంట్ కూడా. అదే స్ఫూర్తితో వెంకటాపురం పాఠశాలలో 92 మంది విద్యార్థులకు రూ.97 వేలు విలువ చేసే ఆర్మీ యూనిఫాం కుట్టించారు. వారితో చక్కని ఫొటో దిగి వారిని ప్రోత్సహించారు. – మాడుగుల రూరల్

ప్రజల మనిషిగా.. వారిలో ఒకరిగా..

మాడుగుల మహిళా సర్పంచ్ సేవలు



దగ్గరుండి పారిశుధ్య పనులు చేయిస్తున్న మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి (ఫైల్)

నియోజకవర్గ కేంద్రం మాడుగుల సర్పంచ్‌గా ఎడ్ల కళావతి సేవా కార్యక్రమాల్లో ముందున్నారు. పోస్టుమాన్ కుమార్తె అయిన ఆమె సామాన్య మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చారు. ప్రజల కష్టసుఖాలు తెలుసు. ప్రతి రోజు ఉదయాన్నే గ్రామంలో తిరుగుతూ కొళాయిలు సక్రమంగా వస్తున్నదీ లేనిదీ పరిశీలిస్తుంటారు. లేకపోతే వెంటనే సరి చేయిస్తారు. పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షిస్తారు. పంచాయతీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తారు. గత ప్రభుత్వంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో ఇంటింటికీ కొళాయిలు, సీసీ రోడ్లు, ప్రధాన డ్రైనేజీలు, కోట్లాది రూపాయలతో శాశ్వత తాగునీటి పథకం నిర్మించి గ్రామాన్ని స్వర్గసీమగా మార్చారు. – మాడుగుల

భర్త ప్రోత్సాహం ఆమె కల సాకారం

ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీతామాణిక్యం



ఏయూక్యాంపస్: అమ్మాయిల చదువుకు ఎక్కువగా ప్రాధాన్యత లేని రోజుల్లో 17 ఏళ్ల వయసులో పెళ్లిపీటలపై కూర్చున్నారు. పెళ్లిచూపుల సమయంలో పెళ్లికొడుకు చదువుకుంటావా అని అడిగిన ప్రశ్న ఆమెలో కొత్త ఆశలను చిగురించేలా చేసింది. అలా భర్త సహకారంతో తన చదువును కొనసాగించారు. నేడు దేశంలో ప్రతిష్ఠాత్మకమైన ఆంధ్రవిశ్వవిద్యాలయం న్యాయ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను నిర్వహించే స్థాయికి ఎదిగారు ఆచార్య కె.సీతామాణిక్యం. ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందంటారు. కానీ ఆచార్య సీతామాణిక్యం విజయం వెనుక ఆమె భర్త తమ్మిరెడ్డి ఉన్నారు. చిన్న వయసులో పెళ్లి చేసుకున్నా విద్యపై ఉన్న ఆసక్తితో ఆమెను ప్రోత్సహించారు. ప్రైవేటుగా డిగ్రీ పూర్తిచేసి అనంతరం ఎం.ఏ హిస్టరీ, బ్యాచలర్ ఆఫ్ లా, ఎం.ఏ ఇంగ్లీషు, ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి మాస్టర్ ఆఫ్‌లా(ఎల్ఎల్ఎం) పూర్తిచేశారు. ఒకవైపు కుటుంబం, పిల్లలు బాధ్యతలను నిర్వహిస్తూ ఒడిశాలోని బ్రహ్మపుర విశ్వవిద్యాలయం నుంచి 2000 సంవత్సరంలో సైబర్ నేరాలపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించారు. 2014లో పోస్ట్ డాక్టరోల్ ఇన్ లా(ఎల్ఎల్‌డీ)ని అందుకున్నారు. రాష్ట్రం నుంచి ఈ డిగ్రీ సాధించిన తొలి వ్యక్తి ఆచార్య సీతామాణిక్యం కావడం విశేషం. వివాహం, కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే తన ఆకాంక్షలను సాకారం చేసుకోవచ్చు అనడానికి ఆచార్య సీతామాణిక్యం జీవితం ఒక ఉదాహరణ మాత్రమే. అనంతరం ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఏయూలో 2006లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2021లో ప్రొఫెసర్‌గా బాధ్యలు చేపట్టారు. 24 జూన్ 2024 నుంచి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. 2023లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్నారు.

క్షయ రహిత పంచాయతీగా భీమవరం ఎంపిక



తురకలపూడి పీహెచ్‌సీ సిబ్బందితో టీబీ జిల్లా అధికారి బాలాజీ

బుచ్చెయ్యపేట: ఆర్.భీమవరాన్ని క్షయ రహిత పంచాయతీగా కేంద్రం ఎంపిక చేసినట్లు జిల్లా క్షయ నివారణాధికారి ఎస్.వి.కె.బాలాజీ తెలిపారు. ముక్త భారత్‌లో భాగంగా శుక్రవారం ఆయన తురకలపూడి పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈనెల 24వ తేదీన టీబీ డే సందర్భంగా కేంద్ర బృందం అనకాపల్లి వచ్చి కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందిస్తారన్నారు. క్షయ నిర్మూలనకు వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. వైద్యాధికారి డి.సంధ్యారాణి, కో ఆర్డినేటర్ అయ్యపురెడ్డి పెంటయ్య, ఆరోగ్య విస్తరణాధికారి రాజశేఖర్, ఫార్మాసిస్టు చంద్రమౌళి, పీహెచ్ఎన్ సీతమ్మ పాల్గొన్నారు.

చిన్నారులపై లైంగిక నేరాలకు కఠిన శిక్షలు



పోక్సో చట్టం గురించి వివరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

యలమంచిలి రూరల్: చిన్నారులు, బాలలపై లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో చట్టం ప్రకారం కఠిన శిక్షలు విధిస్తారని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్యక్షురాలు పి.విజయ అన్నారు. శుక్రవారం యలమంచిలి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో స్వయం సహాయక సంఘాల మహిళలు, ఆశ కార్యకర్తలు, పురపాలక సంఘం పరిధిలో మహిళా ఉద్యోగులకు పోక్సో చట్టంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉన్నత స్థానాల్లో ఉన్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ప్రిన్సిపాళ్ల వంటి వారు తమ స్థానాన్ని ఆసరాగా చేసుకుని పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడితే జీవిత ఖైదు, ఇంకా తీవ్రమైన నేరాలకు పాల్పడితే మరింత కఠినమైన శిక్షలు ఉంటాయన్నారు. చైల్డ్ పోర్నోగ్రఫీ తీవ్రమైన నేరంగా చట్టం చెబుతోందన్నారు. లైంగిక నేరాల కేసులకు సంబంధించి బాధిత పిల్లల దగ్గర్నుంచి వాంగ్మూలాలు తీసుకుంటున్న సమయంలో వారు తమపై జరిగిన అఘాయిత్యాలను చెబుతుంటే చాలా బాధ కలుగుతోందన్నారు. తల్లిదండ్రులు ప్రతిరోజూ పిల్లలతో స్నేహపూర్వకంగా మెలుగుతో పాఠశాలలు, కళాశాలల్లో వాళ్లతో ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, సహచర విద్యార్థులు ఎలా ప్రవర్తిస్తున్నారో తెలుసుకుంటూ ఉండాలన్నారు. చెడు, మంచి స్పర్శల మధ్య తేడాను వారికి వివరించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, యలమంచిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ధూళి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

అనకాపల్లి టౌన్: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు హాల్ టికెట్ ఆధారంగా ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించడానికి అనుమతి ఇస్తున్నట్లు ప్రజారవాణా శాఖ (ఆర్టీసీ) జిల్లా అధికారి కె.పద్మావతి తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి 31 వరకు విద్యార్థులు ఇంటి నుంచి పరీక్ష కేంద్రానికి, మళ్లీ ఇంటికి పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సులలో ప్రయాణించవచ్చన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	శని	ఆది
అనకాపల్లి	6.09	4.56
నర్సీపట్నం	6.12	4.53

ఉపమాక కల్యాణోత్సవాలకు పటిష్ట బందోబస్తు

డ్రోన్ సాయంతో పర్యవేక్షణ : ఎస్పీ తుహిన్ సిన్హా



ఉపమాకలో భద్రతా ఏర్పాట్లు సమీక్షిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా



సబ్ ట్రెజరీ నుంచి తీసుకువచ్చిన నగలు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 9 నుంచి 17 వరకు జరిగే వార్షిక కల్యాణోత్సవాలకు 300మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. శుక్రవారం ఆయన ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయ పరిసరాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. వారం రోజుల పాటు జరిగే కల్యాణోత్సవాలకు సుమారు లక్షమంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గొలుసు దొంగతనాలు, జేబు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవ్ టీజింగ్‌ను నియంత్రించాలన్నారు. కల్యాణోత్సవ పరిసరాలు, మెయిన్ రోడ్డు, మాడ వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మానిటరింగ్ కోసం తాత్కాలిక కంట్రోలు రూం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తుల రద్దీ క్రమబద్ధీకరణ కోసం డ్రోన్ కెమెరాలు ఉపయోగించాలని సూచించారు. అపరిచిత వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. రథోత్సవం నాడు రోప్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ఎస్‌బీ డీఎస్పీ అప్పారావు, నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు కుమారస్వామి, రామకృష్ణ, ఎస్ఐ సన్నిబాబు, ఐటీ కోర్ ఎస్ఐ సురేష్‌బాబు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా దినోత్సవానికి ఏర్పాట్లు

శనివారం జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ తుహిన్ సిన్హా పరిశీలించారు. నక్కపల్లి డిగ్రీ కళాశాల ఆవరణలో మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా హోం మంత్రి వంగలపూడి అనిత హాజరవుతారన్నారు.

ఆలయానికి చేరిన ఆభరణాలు

నక్కపల్లి: ఉపమాకలో ఈనెల 10వ తేదీన జరిగే వెంకన్న కల్యాణోత్సవాల సందర్భంగా స్వామివారికి అలంకరించేందుకు శుక్రవారం సబ్ ట్రెజరీ నుంచి ఆభరణాలను తీసుకువచ్చారు. స్వామివారికి వజ్ర వైఢూర్యాలు, మరకత మాణిక్యాలు, కెంపులు, కోట్లాది రూపాయల విలువైన పచ్చలహారం, చింతాకు పతకం, కాసుల పేర్లు, వజ్ర వైఢూర్యాలు పొదిగిన కిరీటం, కటి, హస్తాలు మొదలయిన స్వర్ణాభరణాలు ఉన్నాయి. భద్రతా కారణాల రీత్యా వీటిని విశాఖలో పటిష్ట బందోబస్తు మధ్య సబ్ ట్రెజరీలో భద్రపరుస్తున్నారు. కల్యాణోత్సవాలకు వీటిని తీసుకువచ్చి స్వామివారి ఉత్సవమూర్తులకు అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. కల్యాణం అనంతరం వీటిని తిరిగి విశాఖ సబ్ ట్రెజరీకి తరలిస్తారు. శుక్రవారం చేరుకున్న ఆభరణాలను ఆలయం వద్ద ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తదితరులు స్వాధీనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీటిని శనివారం నుంచి స్వామికి అలంకరిస్తారు. ఆభరణాలను ఆలయంలో ఉంచిన నేపథ్యంలో ప్రత్యేక పోలీసు సిబ్బంది, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు సిబ్బందితో ఆలయం చుట్టూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కన్నీటి పరీక్ష

తల్లిని కోల్పోయిన దుఃఖంలోనూ పరీక్ష రాసిన ఇంటర్ విద్యార్థి



బాధను దిగమింగుతూ ఇంటర్మీడియట్ పరీక్షకు పయనం..



తారువలో తల్లి పార్థివదేహం వద్ద రోదిస్తున్న ముత్యాల ఆకాష్

దేవరాపల్లి: తల్లిని కోల్పోయిన పుట్టెడు దుఃఖంలోనూ ఇంటర్మీడియట్ విద్యార్థి పరీక్షకు హాజరైన విషాదకర ఘటన తారువలో శుక్రవారం చోటు చేసుకుంది. దేవరాపల్లి మండలం తారువ గ్రామానికి చెందిన ముత్యాల పరమేశ్వరి గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె కుమారుడు ఆకాష్ సహా కుటుంబ సభ్యులంతా రాత్రంతా తల్లి పార్థివదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. చోడవరంలో చదువుతున్న ఆకాష్ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు శుక్రవారం హాజరు కావాల్సి ఉంది. అతని భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కుటుంబ సభ్యులు ఆకాష్‌కు ధైర్యం చెప్పి పరీక్షకు సిద్ధం చేశారు. గుండెల్లో నుంచి ఉబికివస్తున్న బాధను పంటి బిగువున భరిస్తూ పరీక్షకు హాజరయ్యాడు. పరీక్షకు పయనమయ్యే ముందు ఆకాష్ తన తల్లి పార్థివదేహం వద్ద గుండెలవిలేలా రోదించడం పలువుర్ని కంటతడి పెట్టించింది. తల్లికి నమస్కరించి బాధను దిగమింగుతూ పరీక్ష రాసేందుకు చోడవరం పయనమయ్యాడు. ఆకాష్ పరీక్ష రాసి తిరిగి వచ్చాక అశ్రునయనాల మధ్య కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు.

వడ్డాది వెంకన్న కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు 8లో..

క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణాపై ఆర్డీవోకు ఫిర్యాదు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం జంగాలపల్లిలో భారీ ఎత్తున ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ బొంతు రమణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణకు ఫిర్యాదు చేశారు. సుమారు 30 ఎకరాల్లో ఇసుక మేటలను అడ్డగోలుగా తవ్వేస్తున్నారని, పర్యావరణానికి ఇబ్బందులు తలెత్తున్నప్పటికీ మైనింగ్, రెవెన్యూ, పోలీసు పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉచిత ఇసుక ముసుగులో రాత్రింబవళ్లు తేడా లేకుండా రవాణా చేస్తున్నారని, తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు లేవని వాపోయారు. స్థానిక నాయకులు కోట్లాది రూపాయల ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారని, దీనికి అడ్డుకట్ట వేయాలని కోరారు.

గోపురం నిర్మాణానికి రూ.లక్ష విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న జయలక్ష్మి కుటుంబ సభ్యులు

మాడుగుల: పట్టణంలోని హైస్కూల్ కాలనీకి చెందిన మద్దెల జయలక్ష్మి కుమారుడు వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ధనలక్ష్మి దంపతులు ఇక్కడ దేవీతల్లి ఆలయ గోపురం నిర్మాణానికి రూ.1,01,116 విరాళం ఇచ్చారు. ఈ మొత్తం శుక్రవారం ఆలయ కమిటీ, సివిల్ ఆర్టీసీ, ఆటో యూనియన్ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మోదకొండమ్మ కమిటీ మెంబరు దేవరాపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, రాఖి శ్రీను, ఆలయ కమిటీ సభ్యుడు ప్రసాద్ పాల్గొన్నారు.

పెదఉప్పలంలో సర్వే టీం పర్యటన



పెదఉప్పలంలో కేంద్ర బృందం

ఎస్.రాయవరం: కేంద్ర ప్రభుత్వ పథకాలు సరిగా అమలవుతున్నాయో లేదో తెలుసుకునేందుకు సర్వే టీం శుక్రవారం పెదఉప్పలం గ్రామంలో పర్యటించింది. నీతి ఆయోగ్ పంపిన బృందం సభ్యులు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. . ఈ టీమ్‌కు సచివాలయ సిబ్బంది, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ తదితరులు సహాయ సహకారాలు అందించారు. కేంద్రం నుంచి వచ్చిన టీమ్‌లో ఫీల్డ్ మేనేజర్ వికాస్ మల్కర్, టీమ్ సూపర్‌వైజర్ సంధ్యారాణి, ఇన్వెస్టిగేటర్ భానుచందర్, లోకేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది వెంకన్న కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

10 నుంచి 14 వరకు మహోత్సవాలు



క్యూ లైన్లు ఏర్పాటు చేయిస్తున్న ఈవో శర్మ, దేవస్థాన సిబ్బంది



భక్తులకు కొత్తగా ఏర్పాటు చేస్తున్న బాత్‌రూంలు



కల్యాణోత్సవాలకు ముస్తాబవుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయం

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్రలో పేరెన్నికగన్న వడ్డాది వేంకటేశ్వరస్వామి 152వ కల్యాణోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు వీటిని ఘనంగా నిర్వహించనున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కరుణామయుడిగా వడ్డాది వెంకన్నగా పేరొందడంతో ఉత్తరాంధ్ర నుంచే కాక ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఇప్పటికే గిరిజాంబ కొండపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయం చుట్టూ గర్భగుడికి, మెట్లు మార్గం, కల్యాణ మండపం, టికెట్ కౌంటర్ ప్రదేశంలో రంగులు వేసి మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణ ఏర్పాట్లు చేస్తున్నారు. లక్షలాది మంది భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్ల కోసం విశాఖ నుంచి బారికేడ్లను తీసుకొచ్చి ఈవో టీఎస్ఎస్ శర్మ, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేయిస్తున్నారు. ఎండాకాలం కావడంతో మెట్ల మార్గంలో నీడ వసతితోపాటు కొండ దిగువున, పైన మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నారు. భక్తులు వేంకటేశ్వరస్వామికి తలనీలాలు సమర్పించిన తర్వాత స్నానాలు చేయడానికి ఇప్పటి వరకు బాత్‌రూములు లేకపోవడంతో కొండపై కొత్తగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. స్వామివారి ఆలయం నుంచి వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్ వరకు భారీ విద్యుత్ లైటింగ్‌తోపాటు ఆలయం వద్ద, నాల్గు రోడ్ల జంక్షన్ వద్ద భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను తిరువీధుల్లో ఊరేగించేందుకు గజ, గరుడ వాహనాలు శుభ్రం చేయించి కల్యాణ మండపాన్ని ప్రత్యేకంగా సిద్ధం చేస్తున్నారు. దాతలు సహాయంతో ఐదు రోజులు భక్తులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రికి భోజన వసతి కల్పించనున్నారు. ఈ ఏడాది ఉత్సవాలు విజయవంతం చేయడానికి పార్టీలకతీతంగా నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, యువకులు, దాతలు సహకరిస్తున్నారని దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త దొండా కన్నబాబు, ఈవో శర్మ తెలిపారు.

కూటమి నాయకులకు సిగ్గుండాలి



పూర్తయిన తారురోడ్డుపై నిల్చోని కృతజ్ఞతలు చెబుతున్న గిరిజనులు, వైఎస్సార్‌సీపీ నేతలు

- వైఎస్సార్‌సీపీ హయాంలోనే వి.బి.పేట–గొప్పూరు తారురోడ్డు నిర్మాణం
- 4 గ్రామాల గిరిజనులతో పార్టీ నేతల పరిశీలన



పనులు ప్రారంభం-ముగింపు తేదీలతో కూడిన బోర్డు

చీడికాడ: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రారంభమైన రోడ్డు నిర్మాణం ఇటీవల పూర్తయితే, కూటమి ప్రభుత్వం చేసిందని చెప్పుకోవడానికి సిగ్గుండాలని అధికార పార్టీ నాయకులపై వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మ నారాయణమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. చీడికాడ మండలం వి.బి.పేట నుంచి కొండేంపూడి, గొప్పూరు వరకు నిర్మించిన తారురోడ్డును శుక్రవారం వి.బి.పేట సర్పంచ్ వంటాకు సూర్యనారాయణ ఆధ్వర్యంలో కొండేంపూడి, గొప్పూరు, ముడిచర్ల, జైపురం గ్రామాల గిరిజనులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ గతేడాది జనవరి 22న రూ.5.65 కోట్ల నాబార్డు నిధులతో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శంకుస్థాపన చేసి రోడ్డు పనులు ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి నిరంతరాయంగా పనులు జరిగి నేడు అందుబాటులోకి వచ్చిందన్నారు. దీన్ని కూటమి ప్రభుత్వమే చేసిందని పత్రికల్లో ప్రకటనలు ఇచ్చుకోవడానికి సిగ్గుండాలన్నారు. సర్పంచ్ వంటాకు నర్సింహమూర్తి, గిరిజన గ్రామాల నేతలు కోట గంగరాజు, సింగారపు నాగరాజు, బోశెం రాము, సింగారపు ముసిలి, సొలం కొండబాబు తదితరులు మాట్లాడుతూ తమ గ్రామాలకు దారి లేక పోవడంతో మహానేత వైఎస్సార్ హయాంలో రూ.6 లక్షలతో మెటల్ రోడ్డు నిర్మించారని, తర్వాత ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఈ మెటల్ రోడ్డును తారురోడ్డుగా మార్చి తమ కష్టాలను తీర్చారన్నారు. వీరి రుణం తీర్చుకోలేనిదని కృతజ్ఞతలు తెలిపారు. సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, శిరిజాం, ఖండివరం ఎంపీటీసీలు ఈర్లి దేవినాయుడు, గెంజి స్వామిబాలాజీ, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, పార్టీ నేతలు పోతల రమణ, తదితరులు పాల్గొన్నారు.

చెరకు కాటా వద్ద రైతుల నిరసన



సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్‌లో అంతరాయంతో తీవ్రంగా నష్టపోతున్నామని చెరకు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు చీడికాడ మండలం అప్పలరాజుపురం చెరకు కాటా వద్ద సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం సాయంత్రం నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం తీరు వల్లే చెరకు కాటా వద్ద చెరకు ఎండిపోతోందని వాపోయారు. – చీడికాడ

అనకాపల్లిలో బీబీఎస్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్

ఎంవీపీకాలనీ: రామేశ్వరం–భువనేశ్వర్ మధ్య ప్రయాణించే బీబీఎస్ వీక్లీ ఎక్స్‌ప్రెస్(20895/96) అనకాపల్లి స్టేషన్‌లో ఆగనుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ బి.సునీత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆరు నెలల పాటు ప్రయోగాత్మకంగా ఈ రైలు అనకాపల్లిలో హాల్ట్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

మహిళలకు అధిక ప్రాధాన్యమివ్వాలి



మహిళలతో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఇతర అధికారులు

మహారాణిపేట: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం థీమ్ లింగ సమానత్వం, మహిళా సాధికారత ప్రాముఖ్యతను గుర్తు చేస్తుందన్నారు. జెడ్పీ సీఈవో నారాయణమూర్తి మాట్లాడుతూ నిరంతరం సేవా కార్యక్రమాలు, సృజనాత్మకత, ప్రజా సంక్షేమం పట్ల చూపిస్తున్న మహిళా ఉద్యోగుల అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి, డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, ఆనందపురం ఎంపీడీవో జానకీ, పరిపాలనాధికారి ఎ.మంజువాణి, ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

పరవాడ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీలో ఎస్పీ తుహిన్ సిన్హా



పరవాడ పోలీస్ స్టేషన్‌లో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

పరవాడ: గంజాయి అక్రమ రవాణా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పోలీసులను ఆదేశించారు. పరవాడ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి వినియోగదారుల వివరాలను సేకరించి, వారిపై నిఘా ఉంచాలన్నారు. రౌడీ షీటర్లు, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులను కౌన్సిలింగ్ చేయడంతో పాటు వారి కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. నేరాల నియంత్రణకు గస్తీ చర్యలను మరింత ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళా చట్టాలు, పోక్సో యాక్ట్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైం, రోడ్డు భద్రతలపై స్థానిక పోలీసులు, మహిళా పోలీసులతో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పరిశీలించి, వాటి పురోగతిని ఆరా తీశారు. స్టేషన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐలు కృష్ణారావు, మహలక్ష్మిలు ఉన్నారు.

రూ.11 లక్షలతో నిమ్మకట్టు కాలువకు సీసీ లైనింగ్

తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ



సిమెంటు లైనింగ్ పనులు పరిశీలిస్తున్న తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ, జేఈ శ్యామ్‌కుమార్

నాతవరం: వచ్చే ఖరీఫ్‌కు శివారు ఆయకట్టుకు సైతం నిమ్మకట్టు ఆనకట్ట నీరందేలా కాలువలు అభివృద్ధి చేస్తున్నామని తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. మండలంలో రాజుపేట అగ్రహారం సమీపంలో తాండవ నదిపై నిర్మించిన నిమ్మకట్టు ఆనకట్ట ప్రధాన కాలువకు చేస్తున్న సిమెంటు లైనింగ్ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.11 లక్షలతో ఆనకట్ట ప్రధాన గేటు దిగువ ప్రాంతంలో పంట కాలువకు సిమెంటు లైనింగ్ చేస్తున్నామన్నారు. ఆనకట్ట నిర్మాణ సమయంలో చేసిన పనులు పూర్తిగా శిథిలమై రాళ్లు తేలిపోయాయన్నారు. దాంతో పూడిక తీసేటప్పుడు ఇబ్బందిగా ఉంటుందని ఆయకట్టు రైతుల కోరిక మేరకు సిమెంటు లైనింగ్ చేస్తున్నామన్నారు. కాలువకు ఇరువైపులా కొంత మేర గోడ నిర్మిస్తామన్నారు. ఈ వేసవిలో రెండు జిల్లాల సరిహద్దులో కాలువలు అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు నాతవరం సెక్షన్ జేఈ శ్యామ్ కుమార్, మన్యపురట్ల పరిధి తాండవ ప్రాజెక్టు నీటి సంఘం అధ్యక్షుడు అప్పన దివాణం, వర్కు ఇన్‌స్పెక్టరు అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుని వివాహానికి వచ్చి మృత్యువాత

శారదా నదిలో ఈతకు దిగి రావికమతం విద్యార్థి మృతి



నదిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు, స్థానికులు

రాంబిల్లి(అచ్యుతాపురం): స్నేహితుడి వివాహానికి వచ్చిన ఐటీఐ విద్యార్థి శారదా నదిలో ఈతకు దిగి మృతి చెందాడు. రాంబిల్లి మండలం కొత్తూరులో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. రావికమతం మండలానికి చెందిన ఎస్.మణికంఠ విశాఖలోని ప్రైవేట్ ఐటీఐలో చదువుతున్నాడు. కొత్తూరులో తన స్నేహితుని వివాహానికి గురువారం విచ్చేశాడు. ఇక్కడ తన స్నేహితులతో కలిసి శారదా నదిలో సరదాగా ఈతకు దిగాడు. ఆ సమయంలో ఈత కొడుతూ పెద్ద గొయ్యిలో మునిగిపోయాడు. ఎంతకూ బయటకు రాకపోవడంతో మిగిలిన ఫ్రెండ్స్ గట్టిగా కేకలు వేశారు. దాంతో చుట్టు పక్కల వారు వచ్చి పోలీసుల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

‘ఉపాధి’ లక్ష్యాలను సాధించాలి

- ప్రజా వేదికలో డ్వామా పీడీ పూర్ణిమాదేవి
- నిధుల రికవరీకి ఆదేశాలు



ప్రజావేదికలో పీడీ పూర్ణిమాదేవి, విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి తదితరులు

నర్సీపట్నం: ప్రతి జాబ్‌కార్డుదారుకు వంద రోజులు ఉపాధి పని దినాలు కల్పించాలని డ్వామా పీడీ పూర్ణిమాదేవి ఆదేశించారు. ఏడాది కాలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై శుక్రవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద జరిగిన ప్రజావేదికలో ఆమె పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో సోషల్ ఆడిట్ బృందం గుర్తించిన లోపాలను ప్రజావేదికలో వెల్లడించారు. మొక్కలు వేసినట్లు రికార్డుల్లో చూపుతున్నా, క్షేత్రస్థాయిలో అవి లేవని, పనికి వెళ్లకుండా కొందరు పేరున మస్టర్లు వేసినట్లు పీడీ దృష్టికి తీసుకువెళ్లారు. గబ్బాడ ఫీల్డ్ అసిస్టెంట్ సన్యాసినాయుడు నిత్యం మద్యం మత్తులో ఉంటున్నాడని, పని కల్పించటం లేదని కూలీలు ఫిర్యాదు చేశారన్నారు. అతడిని తొలగించాలని ఎంపీడీవో ఉషాశ్రీని పీడీ ఆదేశించారు. ఏడాది కాలంలో రూ.12 కోట్లతో పనులు చేపట్టగా, రూ.లక్ష వరకు దుర్వినియోగం జరిగినట్లు సోషల్ ఆడిట్ బృందం గుర్తించింది. సంబంధిత వ్యక్తులను రూ.60 వేల వరకు రికవరీకి పీడీ ఎంపీడీవోను ఆదేశించారు. అనంతరం రోలుగుంట, నాతవరం, కోటవురట్ల, మాకవరపాలెం మండలాల్లోని ఎఫ్ఎఎస్, టీఎఎస్, ఈఎస్, ఏపీవోలతో సమీక్షించారు. 37,56,173 పని దినాలకు గాను 35,23,727 పని దినాలు పూర్తి చేశారని, మిగిలిన 2,32,446 పని దినాలను ఈ నెల 20వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి అమృత్ సర్వోవర్, రోడ్డుకు ఇరువైపులా రెండు కిలో మీటర్ల మేర మొక్కలు పెంపకం, 20 ఎకరాలు భూ అభివృద్ధి పనులు, ప్రతి రైతుకు మామిడి, కొబ్బరి, జీడి మొక్కలు పంపిణీ చేయాలన్నారు. చెరువు గట్లపై కొబ్బరి మొక్కలు నాటాలన్నారు. జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ నిర్మలాదేవి, స్టేట్ రిసోర్స్ పర్సన్ నాగరాజు, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, ఎంపీటీసీ బోళెం చినబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు శ్రీరంగస్వామి పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

చోడవరం: మోటారు సైకిళ్ల దొంగను పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల చోడవరం పరిసరాల్లో పలు చోట్ల మోటారు సైకిళ్లు చోరీకి గురయ్యాయి. దీనిపై దృష్టి సారించిన పోలీసులు ఎట్టకేలకు మోటారు సైకిళ్లు చోరీ చేస్తున్న నిందితుడ్ని అరెస్టు చేశారు. ఈ మేరకు రెండు కేసుల్లో రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ అప్పలరాజు చెప్పారు. నిందితుడు మైనర్ కావడంతో రిమాండ్ నిమిత్తం జువైనల్ జైలుకు తరలించామన్నారు.

హెల్త్‌సిటీలో రక్త రుగ్మతల కేంద్రం ప్రారంభం



రక్త రుగ్మతల సంస్థను ప్రారంభిస్తున్న హెమటాలజీ పితామహుడు డాక్టర్ మామ్మెన్ చాందీ

ఆరిలోవ: హెల్త్‌సిటీ యునిక్ ఆస్పత్రిలో మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్త రుగ్మతుల కేంద్రం అందుబాటులోకి వచ్చింది. ఈ కేంద్రాన్ని హెమటాలజీ పితామహుడు డాక్టర్ మామ్మెన్ చాందీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సికిల్ సెల్, తలసేమియాతో బాధపడుతున్న వారు ఎక్కువగా ఉన్నారన్నారు. అలాంటి వారికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. పేదలకు వైద్యం అందుబాటులో ఉండే విధంగా ఈ కేంద్రాన్ని నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఈ కేంద్రం విశాఖలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఊన్న మురళీకృష్ణను అభినందించారు. నిమ్స్ మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సదాశివుడు మాట్లాడుతూ విశాఖలో రక్త రుగ్మతుల కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల ఆరోగ్య సంరక్షణలో కీలక ముందడుగు పడిందన్నారు.దీర్ఘకాలిక వ్యాధులు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. అలాంటి సమస్యల నివారణకు ఈ కేంద్రం అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఏపీతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో ఎక్కడా రక్త వ్యాధులను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా హెమటాలజీ కేంద్రం లేదన్నారు. ఈ లోటును భర్తీ చేయడానికి ఇక్కడ సమగ్ర రక్త రుగ్మతల కేంద్రం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పలువురు ఆంకాలజీ విభాగం వైద్యులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చోడవరం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీప కాలువలో గుర్తుతెలియని మృతదేహాన్ని చోడవరం పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ మృతదేహం దుర్వాసన రావడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారెళ్లి మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీశారు. సుమారు 45–50 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మగవ్యక్తిగా గుర్తించారు. నల్లరంగు ఫుల్‌ప్యాంట్, నల్లరంగు ఫుల్‌హ్యాండ్స్ నిలువు గీతలు కలిగిన చొక్కా శరీరంపై ఉన్నట్టు ఎస్ఐ నాగకార్తీక్ చెప్పారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేశామన్నారు. మృతుడి కుటుంబ సభ్యులుగానీ బంధువులుగానీ 9440796090, 9492952555 నంబర్లను సంప్రదించాలన్నారు.

రాయితీపై పాడి పశువులకు బీమా

మాకవరపాలెం: రాయితీపై పశువులకు బీమా కల్పిస్తున్నట్టు పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి రామ్మోహన్‌రావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పశువులకు 80 శాతం రాయితీతో బీమా అందిస్తున్నాయన్నారు. రెండేళ్ల కాలంలో 10,231 పశువులకు బీమా చేయగా, మృతి చెందిన 179 పశువులకు మంజూరైన రూ.52 లక్షల 98 వేల బీమా నగదును రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. ఈ నెల 1 నుంచి ప్రారంభమైన గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమంలో జిల్లాలో ఇప్పటి వరకు 90 వేల పశువులకు టీకాలు వేశామన్నారు. వర్షాకాలంలో పశువులకు అధికంగా సోకే గాలికుంటు వ్యాధిని నివారించేందుకు ఈ నెలాఖరు వరకు టీకాలు వేస్తున్నామన్నారు. జిల్లాలో 817 మినీ గోకులాలు మంజూరు చేయగా ఇప్పటివరకు 742 గోకులాల నిర్మాణం పూర్తయినట్టు చెప్పారు.

క్లుప్తంగా

10న వీరభద్రస్వామి కల్యాణం

అనకాపల్లి టౌన్‌: పట్టణంలోని దేవునిగుమ్మం లో కొలువుదీరిన భద్రకాళి వీరభద్రస్వామి సహిత ఉమారామలింగేశ్వస్వామి శివాలయం సహిత నవగ్రహ దేవాలయంలో ఈ నెల 10న వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం నిర్వ హించనున్నట్లు ఆలయ అర్చకుడు డి.వెంకటర మణ తెలిపారు. ఉదయం 8 గంటలకు ఏకాదశి రుద్రాభిషేకం, రాఘవేంద్ర భజన మండలి ఆధ్వర్యంలో వేదపారాయణం, కీర్తనలు, వం డర్‌ కిడ్స్‌తో భక్తి శ్లోకాలు, సాయంత్రం స్వామి వారి కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. రుద్రాభిషేకం చేయించుకొనే భక్తులు ఆలయం లో గోత్ర నామాలు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా ఫేర్‌వెల్‌ డే



విద్యార్థుల నృత్య ప్రదర్శన

అనకాపల్లి టౌన్‌: పట్టణంలో మహాత్మ జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్‌ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్‌ డే శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో సం దడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌ దేవరశెట్టి వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు బి.ఎస్‌.ఎం.కె.జోగినాయుడు, బొడ్డేడ మురళీ, బొడ్డేడ శ్రీను, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌ గొర్లె నాయుడు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్‌ కర్రి గంగాధర్‌, తదితరలు పాల్గొన్నారు.

‘ఎన్టీఆర్‌ ఆస్పత్రిలో సదుపాయాలు కరవు’



ఎన్టీఆర్‌ ఆస్పత్రిలో అధ్వానంగా ఉన్న పరిస్థితులను చూపిస్తున్న వియ్యపు రాజు

అనకాపల్లి టౌన్‌: స్థానిక ఎన్టీఆర్‌ ఆస్పత్రిలో కనీస సదుపాయాలు కరువయ్యాయని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్‌) జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆస్పత్రిని సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల ప్రసవం సమయాలలో వచ్చే సహాయ కుల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి గదికి మర మ్మతులు చేపట్టి, తగిన సౌకర్యాలు కల్పించాల న్నారు. జిల్లా నలుమూలల నుంచి బాధితులు వస్తున్నా ఒక్క డయాలసిస్‌ సెంటర్‌ లేకపోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు.

గౌరీ గ్రంథాలయంలో సదస్సు నేడు

అనకాపల్లి టౌన్‌: పట్టణంలోని గౌరీ గ్రంథాల యంలో నేర్చుకోవడం, జ్ఞాపక శక్తి అంశాలపై శనివారం సాయంత్రం 5 గంటలకు సదస్సు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులు దొడ్డి నూకఅప్పారావు, కాండ్రే గుల వెంకటరమణ తెలిపారు. గ్రంథాలయం 83వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ న్యూరో సర్జరీ నిపుణుడు డాక్టర్‌ మళ్ల భాస్కర రావు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసు కోవాలని వారు కోరారు.

జి.భీమవరంలో రికార్డుల పరిశీలన



పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో వి.వి.రవికుమార్‌

కశింకోట: మండలంలోని జి.భీమవరం పం చాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఎంపీడీవో వి.వి.రవికుమార్‌ సందర్శించారు. ఈ సంద ర్భంగా పంచాయతీ రికార్డులను పరిశీలిం చారు. పన్నుల వసూలుపై ఆరా తీశారు. పారి శుధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో పం చాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 5,978 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్‌ రకం	3,810	4780
మొదటి రకం	3,550	4.300
రెండో రకం	3,200	3,770
మూడో రకం	3,000	3,190

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్‌ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 88 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్‌–12 యూనిట్లు , బీ పాజిటివ్‌–31 యూనిట్లు, ఓ పాజిటివ్‌–43 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌ బ్యాంకు టెక్నీషియన్‌ య.లో కేష్‌ను 97036 19706 ఫోన్‌ నంబరులో సంప్ర దించవచ్చు.

మహిళలు.. మహారాణులు..!

అన్ని రంగాల్లోనూ రాణిస్తున్న మగువలు

కశింకోట మండలంలో ఉద్యోగం, రాజకీయాల్లోనూ సత్తా



ఎంపీపీ కలగా లక్ష్మి

వైస్‌ ఎంపీపీ పెంటకోట జ్యోతి

బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రత్యేక అధికారి వి.లక్ష్మి సుభాషిణి

వైస్‌ ఎంపీపీ నమ్మి మీనా

బాలికల హైస్కూలు హెచ్‌ఎం ఎంఎస్‌ స్వర్ణకుమారి

నరసింగబిల్లి పశు వైద్యాధికారి సీహెచ్‌. చైతన్యమణి

కశింకోట:

ఓ వైపు ఇంటిని చక్కబెడుతూనే.. మరో వైపు తమకు నచ్చిన రంగంలో రాణిస్తున్నారు పలువురు మహిళలు. పురుషులతో సమానంగా అన్ని రంగా ల్లోనూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. కశింకోట మండలాన్ని అధిక శాతం మంది మహి ళలే ఏలుతున్నారు. ఒక వైపు రాజకీయంగాను, మరో వైపు అధికారులు గాను మహిళలు ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వ హయాంలో మహిళా రిజ ర్వేషన్‌ను 33 నుంచి 50 శాతానికి పెంచడంతో మహిళలకు ప్రాధాన్యం మరింత పెరిగింది. దీంతో మండలంలో ఎక్కువ మంది మహిళలకు పదవులు దక్కాయి.

ఇక పాఠశాలలు, పీహెచ్‌సీలు, పశు వైద్యాల యాలలో మహిళా ఉద్యోగులే ఎక్కువ మంది బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పురుషులకు తాము ఎక్కడా తీసిపోమనేలా తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తు న్నారు. మండలంలో 67,272 మంది జనాభా ఉం ది. వీరిలో అత్యధికంగా 34,494 మంది మహిళలు ఉండగా, 32,768 మంది పురుషులున్నారు. 27 పంచాయతీలు, 19 ఎంపీటీసీ స్థానాలున్నాయి. వీటిలో అత్యధిక చోట్ల మహిళలే సర్పంచ్‌లుగా, ఎం పీటీసీ సభ్యులుగా కొనసాగుతున్నారు. మండల పరిషత్‌లో కీలక పదవులను మహిళలే నిర్వర్తిస్తు న్నారు.

మండల ప్రత్యేక అధికారిగా వి.లక్ష్మీ సుభాషిణి వ్యవహరిస్తుండగా.. ఎంపీపీగా కలగా లక్ష్మి, వైస్‌ ఎంపీపీలుగా పెంటకోట జ్యోతి, నమ్మి మీనా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

మండల పరిషత్‌ ఏర్పాటు నుంచి మహిళలదే హవా

మండల పరిషత్‌ ఏర్పాటు అయినప్పటి నుంచి కూడా మహిళలే కీలక పదవులు నిర్వర్తించారు. సమితుల స్థానంలో మండల పరిషత్‌లు ఏర్పడిన తర్వాత 1986లో తొలిసారిగా నిమ్మదల వెంకట వరలక్ష్మి ప్రత్యక్ష ఎన్నికల్లో ఎన్నికై ఎంపీపీగా బాధ్య తలు నిర్వహించారు. ఆ తర్వాత 1995లో కొత్తగా పంచాయతీరాజ్‌ చట్టం అమలులోకి రావడంతో మండల పరిషత్‌తో పాటు మండలానికొక జెడ్పీ టీసీ స్థానాలు ఏర్పడ్డాయి. దీంతో ఆ ఎన్నికలతో పాటు 2001లో కూడా వరుసగా జెడ్పీటీసీ సభ్యురా లిగా, 2006లో ఎంపీపీగా మలసాల కాసులమ్మ(ధనమ్మ) బాధ్యతలు నిర్వర్తించారు. 2014లో ఎంపీ పీలుగా పెంటకోట సుబ్బలక్ష్మి, పంచదార్ల లక్ష్మి చెరి సగం బాధ్యతలు నిర్వహించారు. జెడ్పీటీసీగా మళ్లీ కాసులమ్మ చక్రం తిప్పారు. తాజాగా కూడా ఎం పీపీ, వైస్‌ ఎంపీపీలుగా మహిళలే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 19 ఎంపీటీసీ స్థానాల్లో 14 స్థానాల్లో మహిళలే పదవులు చేపట్టడం గమనార్హం. గత ఎన్నికల వరకు మహిళలకు 33 శాతం మేర రిజర్వేషన్‌ ఉండేది.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచారు. దీంతో ఈ మేరకు సగం స్థానాలతో పాటు ఇతర జనరల్‌ స్థానాల్లో కూడా మహిళలే ఎన్నిక కావడంతో 14 మందికి పదవులు లభించాయి. ఇక పంచాయతీ సర్పంచ్‌ పదవుల్లో కూడా అత్యధికులు మహిళలే ఉన్నారు.

అధికారుల్లో మహిళామణులు

మండల పరిషత్‌ ప్రత్యేక అధికారిగా సుభా షిణి కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మం డలంలో ఉన్న మూడు ప్రభుత్వ పశువైద్య ఆస్పత్రులకు మహిళలే వైద్యులుగా కొన సాగుతున్నారు. కశింకోటలో అల్ఫాన్సా జార్జ్‌, కన్నూరుపాలెంకు ఎం.డయానా, నరసింగ బిల్లికి సిహెచ్‌.చైతన్యమణి పశు వైద్యులుగా వ్యవహరిస్తున్నారు. మండలంలో 13 హైస్కూళ్లు, విద్యా సంస్థలుండగా వాటిలో అత్యధికంగా 8 స్కూళ్లకు హెచ్‌ఎంలు, ప్రిన్సి పాళ్లగా మహిళలే ఉన్నారు. కశింకోట బాలికల హైస్కూలుకు ఎం.ఎస్‌.స్వర్ణకుమా రి, తాళ్లపాలెం హైస్కూలుకు విజయలక్ష్మి సుమన్‌, నరసింగబిల్లి స్కూలుకు బి.సునీత, కన్నూరుపాలెం స్కూలుకు పి.శేషారత్నం, జమాదులపాలెంకు జ్యోతి హెచ్‌ఎంలుగా వ్యవహరిస్తున్నారు.

ప్రధానమైన ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా జి.గ్రేస్‌, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా మార్తా తిలకం, కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రిన్సిపాల్‌గా దొండా చంద్రకళ వ్యవహరిస్తుం డగా, ఈవోపీఆర్డీగా వెంకటలక్ష్మి, మండల వ్యవసాయ అధికారిగా ఎం.స్వప్న, అసిస్టెంట్‌ స్టాటిస్టిక్స్‌ అధికారి జి.సునీతదేవి వ్యవహరి స్తున్నారు. రెండు ప్రాథమిక ఆరోగ్య కేం ద్రాల్లో తాళ్లపాలెంకు ప్రధాన వైద్యురాలిగా ఎ.మనీషా వ్యవహరిస్తుండగా, కశింకోటలో రెండో వైద్యురాలిగా యశోద కొనసాగుతు న్నారు. బాల సదనం ఇన్‌చార్జిగా శశికళ, సమగ్ర బాలికల వసతి గృహం సంక్షేమ అధి కారిగా నిర్మల బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇక 19 సచివాలయాల్లో కూడా మహిళా ఉద్యోగులే ఎక్కువ మంది విధులు నిర్వర్తిస్తు న్నారు. ఇలా మండలంలో మహిళల హవా కొనసాగుతోంది.

చెత్త డంపింగ్‌కు స్థలం దొరకలేదా.. కొణతాల?



జీవీఎంసీ కార్యాలయం ఆవరణలో ఉన్న డంపింగ్‌ యార్డు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

అనకాపల్లి టౌన్‌: అధికారం చేపట్టి తొమ్మిది నెలలైనా చెత్తను డంప్‌ చేసేందుకు స్థలం దొరక లేదా? ఎమ్మెల్యే కొణతాలా? అంటూ ప్రజా సంఘాల ఐక్యవేదిక నేతలు మండిపడ్డారు. జీవీఎంసీ కార్యాలయం ఆవరణలో ఉన్న డంపింగ్‌ యార్డును శుక్రవారం ప్రజాసంఘాల నేతలు పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊరు నుంచి సేకరించిన చెత్తను మళ్లీ సొం త కార్యాలయంలో వేసుకోవడం రాష్ట్ర చరిత్రలో ఎక్కడా లేదన్నారు. డంపింగ్‌ యార్డ్‌ను శాశ్వతంగా తరలించేం దుకు కార్యచరణ రూపొందించాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఐక్యవేదిక నేతలు బొడ్డేడ అప్పారావు, చిన్ని యాదవ్‌, సూదికొండ మాణిక్యాలరావు, కొల్లు చిన్న అప్పారావు, వాసుపల్లి తాతయ్య పాల్గొన్నారు.

మహిళలపై దాడుల నివారణకు కఠిన చట్టాలు అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

అనకాపల్లి టౌన్‌: మహిళలపై దాడుల నివారణకు కఠిన చట్టాలు తేవాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బూసి పరమేశ్వరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా పట్టణంలో శుక్ర వారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ఇప్పటికీ అర్ధరాత్రి మహిళ ఒంటరిగా బయట తిరగాలంటే బయపడే రోజులు ఉన్నాయ న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సుబ్బ లక్ష్మి, పి.నారాయణమ్మ, జి.లక్ష్మి, తులసి, కె.లక్ష్మి, సర స్వతి, కె.వర, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతో మహిళల హక్కుల సాధన



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

తుమ్మపాల: మహిళలు అన్ని రంగాల్లో పోటీపడు తున్నారనే భావనతోనే మహిళల హక్కుల్ని అణిచి వేస్తున్నారని యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి ఆరోపించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సీఐటీయూ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, యూటీఎఫ్‌ ఆధ్వర్యంలో పట్టణంలో కాంప్లెక్స్‌ నుంచి ర్యాలీగా నాలుగు రోడ్ల జంక్షన్‌ వరకు శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. న్యాయవాది, డాక్టరు, పోలీసు, రాజకీయ నాయకులు, కార్మికులు, తది తర వేషధారణలతో మహిళలు ర్యాలీలో ఆకట్టుకు న్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళలను గౌరవించాలని, స్కీం వర్కర్లకు వేత నాలు పెంచాలని డిమాండ్‌ చేశారు. మహిళలకు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలన్నారు. మహిళల హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం మద్యం పాలసీ వల్ల విపరీతంగా మహిళలపై దాడులు పెరిగాయని ఆరోపించారు. అత్యాచా రాలు, వేధింపులు నిత్యకృత్యంగా మారాయన్నారు. మద్యాన్ని అరికడతామని చెప్పిన ప్రభుత్వం విచ్చ లవిడిగా బెల్టు షాపుల్ని పెంచి పోషిస్తోందని ఆరో పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్‌.శంకర రావు మాట్లాడుతూ అచ్యుతాపురంలోని బ్రాండిక్స్‌ కంపెనీలో 20 వేల మంది మహిళలు పనిచేస్తున్నార ని, వారికి కనీస వేతనాలు అమలు కావడం లేద న్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు రామలక్ష్మి, విజయలక్ష్మి, సాయి, ఆశా వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షు రాలు శాంతి, రమణమ్మ, యూటీఎఫ్‌ జిల్లా నాయ కులు హైమావతి, ఆశ, సీఐటీయూ నాయకులు గం టా శ్రీరామ్‌, పరమేశ్వరరావు, భవాని, అజయ్‌, తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు



ఫిర్యాదులపై అధికారులతో చర్చిస్తున్న మండల ప్రత్యేక అధికారి లక్ష్మీ సుభాషిణి

కశింకోట: న్యాయమైన భూసమస్యలు, వివాదాలను పరిష్కరించడానికి మం డల స్థాయి సమన్వయ కమిటీ చర్యలు తీసుకుంటుందని మండల ప్రత్యేక అధికారి వి.లక్ష్మీసుభాషిణి అన్నారు. కశింకోట మండల పరిషత్‌ కార్యాలయం లో మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా రెండు, మూడు వర్గాల మధ్య ఏర్పడే భూ వివాదాలను పరిష్కరించి న్యాయం చేయడానికి కృషి చేస్తున్నామ న్నారు. అనంతరం మూడు వర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలిం చారు. న్యాయం చేయడానికి చర్యలు చేపడతామని బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.వి.రవికుమార్‌, డిప్యూటీ తహ సీల్దార్‌ కుమార్‌స్వామి, ఎస్‌ఐ మనోజ్‌కుమార్‌, హౌసింగ్‌ ఏఈ వి.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

వసతి గృహంలో దంగల్‌ సినిమా ప్రదర్శన



కశింకోట వసతి గృహంలో దంగల్‌ సినిమాను వీక్షిస్తున్న విద్యార్థినులు

కశింకోట: విద్యతో పాటు బాలికలు క్రీడలు, ఇతర రంగాల్లో రాణించడానికి కృ షి చేయాలని సీఐ అల్లు స్వామినాయుడు సూచించారు. కశింకోటలోని సమగ్ర బాలికల వసతి గృహంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా పోలీస్‌ శాఖ ఆధ్వర్యంలో దంగల్‌ సినిమాను శుక్రవారం రాత్రి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల్లో విద్య, క్రీడలు, ఇతర రం గాల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు, ప్రేరణగా నిలవడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఎస్‌ఐ మనోజ్‌కుమార్‌, వసతి గృ హం సంక్షేమ అధికారి నిర్మల, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

12న చలో విజయవాడను జయప్రదం చేయండి

తుమ్మపాల: ఉపాధి కూలీల అలవెన్సు, పే స్లిప్పులు, బకాయిల చెల్లింపులు, తదితర డిమాండ్ల సాధన కోసం ఈ నెల 12న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

ఈ మేరకు శుక్రవారం పట్టణంలో దొడ్డి రాము నాయుడు భవనంలో సంఘం జిల్లా కమిటీ సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ బకాయిలు, సమ్మర్‌ అలవెన్సులు, పే స్లిప్పులు ఇవ్వకపోవడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ పనులు లేక, ఉపాధి కూలీ చాలక రోజూ వేలాది మంది వలస పోతున్నారన్నారు. పేదల కోసం తెచ్చిన ఉపాధి హామీ చట్టం అమలు చేయడంలో చాలా లోపాలున్నాయని చెప్పారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ఈ నెల 12న విజయవాడ ధర్నా చౌక్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు.

జన్‌ ఔషధి కేంద్రాలతో చౌక ధరలకే మందులు

- అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌



దీపాంజలినగర్‌ జన్‌ ఔషధిలో ఎంపీ సీఎం రమేష్‌

పరవాడ: దేశవ్యాప్తంగా లక్షలాది ప్రజల ఆరోగ్య ఖర్చులను తగ్గించడంలో జన్‌ ఔషధీకేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అనకాపల్లి ఎంపీ సీ.ఎం.రమేష్‌ అన్నారు. జనరిక్‌ మందుల వాడకం పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ప్రధాని మోదీ పిలుపు మేరకు మార్చి 7న జన్‌ ఔషధీ దివస్‌ను ఘనంగా నిర్వహిస్తున్న తరుణంలో దీపాంజలినగర్‌ జనరిక్‌ మెడికల్‌ షాపును శుక్రవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో 15 వేలకు పైగా జనరిక్‌ ఔషధి కేంద్రాలున్నాయని, వాటిలో రెండు వేల కంటే ఎక్కువ రకాల మందులు, 300 శస్త్ర చికిత్స ఉత్పత్తులను తక్కువ ధరలకే అందిస్తు న్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మరిన్ని ఔషధీ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తామ న్నారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ సింహాద్రి ప్రాజెక్టు హెడ్‌ సమీర్‌శర్మ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్ర మోహన్‌, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్య క్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ నాయ కులు బండారు అప్పలనాయుడు, కూటమి నాయ కులు పాల్గొన్నారు.

పోలీస్‌ స్టేషన్‌లో ఓపెన్‌ హౌస్‌



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ధనుంజయ్‌

కె.కోటపాడు: ప్రజలకు శాంతిభద్రతల కల్పనలో పోలీసుల పాత్ర ప్రముఖమని ఎస్‌ఐ ఆర్‌.ధనుంజయ్‌ అన్నారు. స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో శుక్రవారం ఓపెన్‌ హౌస్‌ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ప్రజలకు అందుతున్న సేవలపై ఆయన వివరించారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌, సైబర్‌ మోసాల బారిన పడ కుండా ఉండాలని సూచించారు. స్టేషన్‌లో లాకప్‌, ఫిర్యాదుల స్వీకరణ, తది తర వాటిపై అవగాహన కల్పించారు. పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్ల ఫారంలో వైద్య బృందం తనిఖీలు



కోళ్ల ఫారాన్ని పరిశీలిస్తున్న వైద్య బృందం, అధికారులు

పరవాడ: గ్రామ సమీపంలోని ఓ కోళ్ల ఫారంలో మృతి చెం దిన కోళ్లతో వ్యాపించిన దుర్వాసనపై ఆందోళన చెందిన స్థానికులు అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన అధికారులు సం బంధిత కోళ్ల ఫారాన్ని సందర్శించారు. కోళ్ల ఫారంలో వీధి కుక్కలు చొరబడి సుమారు 250 కోడి పిల్లల్ని చంపేశాయి. వీటిని కోళ్ల ఫారం యజమానికి చూపించేందుకు సిబ్బంది మూటలు కట్టి ఓ గదిలో భద్రపరిచారు. వాటి నుంచి దుర్వాసన రావడంతో సమీప నివాసులు అధికారులకు సమాచారం అందించారు. ఎంపీడీవో వి.ధర్మారావు, పశు వైద్య శాఖ ఏడీ రామకృష్ణకీర్తి, పరవాడ పీహెచ్‌సీ వైద్యా ధికారి జయశ్రీ కరిష్మా, పరవాడ పంచాయతీ కార్యదర్శి మురళీపట్నాయక్‌ ఘటన స్థలికి చేరుకుని మృతి చెందిన కోళ్లను గోతిలో పూడ్చించి, మందులు పిచికారీ చేయించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తీసుకుం టామని నిర్వాహకులను హెచ్చరించారు.